ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 20 జూలై 2025



శ్రీకాకుళం ఏఎంసీ చైర్‌పర్సన్ మార్పు

అరసవల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దారపు జ్యోత్స్న స్థానంలో మరొకరిని నియమించనున్నారు. జనసేనకు చెందిన జోత్స్న నియామకంపై ఆ పార్టీలోనే వ్యతిరేకత ఏర్పడింది. పార్టీ స్థాపించినప్పటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యమివ్వకుండా, వైసీపీ నుంచి వచ్చిన వారికి ఆ పదవి కట్టబెట్టడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విషయం పార్టీ హైకమాండ్‌కు కూడా చేరింది. దాంతో ఆమెకు కేటాయించిన ఏఎంసీ పదవిని రద్దు చేసినట్లు తెలిసింది. జ్యోత్స్న స్థానంలో ఏఎంసీ చైర్మన్‌గా త్వరలోనే కొత్త పేరును ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



నీలాకాశం.. విహంగ విహారం



వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. బయటకు వెళ్లాలంటే భయం. చినుకు జాడ కోసం జనం కళ్లుకాచేలా ఎదురు చూశారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. ఈ వానకు ప్రకృతి కూడా పులకించింది. నీలాకాశం.. తెల్లని మేఘాలతో మెరిసింది. చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ పక్షులు వినీలాకాశంలో కనువిందు చేశాయి. నగరంలో ఆవిష్కృతమైన ఈ దృశ్యం చూపరులను ఆకర్షించింది.

- అరసవల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి)

చేప కిలో రూ. వెయ్యి

బందరువానిపేట గ్రామంలో శనివారం ఉదయం ఇద్దరు మత్స్యకారుల వలకు పది కిలోల కోనెం చేప చిక్కింది. సహజంగా కోనెం చేప మూడు నుంచి ఐదు కిలోల బరువు మాత్రమే ఉంటుంది. అయితే ఇది పది కిలోలు ఉండడంతో మత్స్యకారులు ఆశ్చర్యపోయారు. దీన్ని కిలో రూ.వెయ్యి చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. పెద్ద కోనెం చేపలు ఈ సీజన్‌లోనే దొరుకుతాయని మత్స్యకారులు సూర్యరాయణ, సింహాద్రి తెలిపారు.

- గార, జూలై 19(ఆంధ్రజ్యోతి)

మత్స్యకారులకు చిక్కిన పది కిలోల పెద్ద కోనెం





మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కన విప్ బెందాళం అశోక్

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జగన్ లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదు
- టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ
- ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

సోంపేట రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వైసీపీ హయాంలో గాడి తప్పిన పాలనను సరిచేస్తూ.. సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన సోంపేట మండలం ఎకువూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 'టీడీపీ హయాంలోనే మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ సరఫరా చేశాం. వారి సంక్షేహం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా మారిన పాలనను సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనూ వైసీపీ అధినేత వైఎస్ జగన్.. తన ఉనికిని చాటుకోవడానికి కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. ఇటువంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదు' అని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడుతూ.. 'టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మత్స్యకార గ్రామాలకు వెలుగులు వచ్చాయి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలే ప్రచారకర్తలు. మాయమాటలు చెప్పేందుకు గ్రామాలకు వస్తున్న వైసీపీ నాయకులను ప్రజలు నిలదీయాల'ని కోరారు. ఏడాది పాలనలో అందించిన సంక్షేమం, సాధించిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు రూ.95లక్షలతో నిర్మించనున్న బీచ్ రోడ్డుకు మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. బట్టిగల్లూరు నుంచి ఎకువూరు సభా వేదిక వద్దకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీకే నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దు కుమార్, మహిళా అధ్యక్షురాలు శ్యామల, ఎం.పాపారావు, బడే తమ్మారావు, వాసుపల్లి కృష్ణారావు, బడే సూరి, మద్దు రాజారావు, ఏఎంసీ చైర్మన్లు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆ బియ్యం.. హాంఫట్!



మెళియాపుట్టిలో ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వలు



50 కిలోల బస్తాకు 47.420 కిలోలు వచ్చిన బియ్యం

మెళియాపుట్టి పౌరసరఫరాల గోదాము నుంచి మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో 94 రేషన్ డిపోలకు ప్రతీ నెల 6వేల క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తారు. కాగా క్వింటాకు నాలుగు కిలోల బియ్యం తరుగు వస్తున్నాయని డీలర్లు ఆందోళన చెందుతున్నారు. 50 కిలోల బస్తాకు 47 నుంచి 48 కిలోల మధ్య మాత్రమే బియ్యం ఉంటున్నాయని వాపోతున్నారు. గత నెలలో మెళియాపుట్టి మండలానికి చెందిన కొంతమంది డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆందోళన చేశారు. డీటీ ప్రసాదరావు వారికి సర్దిచెప్పారు. కానీ ఆ తరుగు సంగతి మాత్రం తేలలేదు.

- గోదాముల నుంచి డిపోలకు సక్రమంగా చేరని వైనం
- 50 కేజీల బస్తాకు సుమారు 3 కిలోల తరుగు
- ఆ భారం తమపై పడుతోందని డీలర్ల ఆవేదన
- సరిహద్దు మిల్లులో నిల్వ చేస్తున్నారని ఆరోపణ

మెళియాపుట్టి, జూలై 19(ఆంధ్రజ్యోతి): గోదాముల నుంచి డిపోలకు సరఫరా చేసే రేషన్ బియ్యం బస్తాల్లో తరుగు వస్తోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఈ నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తోంది. ప్రతీ నెల పౌరసరఫరాల గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు బియ్యం తరలిస్తారు. అక్కడి నుంచి రేషన్ డిపోలకు బియ్యం రవాణా చేస్తారు. వాటిని డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తారు. కాగా.. ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియదు కానీ, ప్రతీ నెలా రేషన్ డీలర్లు వద్దకు వచ్చేసరికి 50 కిలోల బస్తాకు సుమారు రెండు నుంచి మూడు కేజీల బియ్యం తరుగు వస్తోంది. గోనెసంచె బరువు సుమారు 580 గ్రాములు ఉంటుంది. దీనికి సంబంధించి అదనంగా బియ్యం రావాల్సింది పోయి తరుగు వస్తోందని, ఆ భారం తమపై పడుతోందని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, తమ సమస్యకు పరిష్కారం చూపడం లేదని వాపోతున్నారు.

తూకం వేయకుండానే..

ప్రతీ మండలస్థాయిలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలున్నాయి. వేబ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో తూకం వేసి రేషన్ డిపోలకు వెళ్లే ట్రాక్టర్లలో లోడింగ్ చేయాలి. కానీ కొన్నిచోట్ల తూకం వేయకుండానే బస్తాలు లోడింగ్ చేసి డిపోలకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ బియ్యం డిపోలకు చేరి తూకం వేయగా తరుగు కనిపిస్తోందని డీలర్లు పేర్కొంటున్నారు. దీనిపై అడిగితే.. రేషన్ కోటా మేరకే వేబ్రిడ్జిపై తూకం చూపి రశీదు ఇస్తామని సిబ్బంది చెబుతున్నట్టు సమాచారం.

ఇదీ పరిస్థితి: జిల్లాలో 1,625 రేషన్ డిపోల పరిధిలో 6,35,471 రేషన్‌కార్డులు ఉన్నాయి. 18,80,952 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం డిపోల ద్వారా ప్రతీ నెలా 5 కిలోల బియ్యం చొప్పున 94,04,760 కిలోలు పంపిణీ చేస్తోంది. కాగా, క్వింటాకు 5 నుంచి 8 కిలోల బియ్యం తగ్గుతున్నాయని, అవి ఎక్కడికి వెళ్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పౌరసరఫరాలశాఖ ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ నిలిపివేసింది. ఈ నెల నుంచి (మిగతా 7వ పేజీలో..)



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

శివారు భూములకూ సాగునీరు

- ఎరువులపై ఫిర్యాదులు రాకూడదు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శివారు గ్రామాల్లో భూములకు సైతం సాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించాలి. కాలువల్లో పూడికతీతలు వేగవంతం చేయాలి. అవసరమైన తాత్కాలిక సిబ్బందితో పిచ్చిమొక్కలు తొలగించాలి. చెరువుల్లో నీరు నిల్వ చేయాలి. సాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక రూపొందించాలి. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి. రైతుసేవా కేంద్రాల్లో కూడా నిల్వలు ఉంచాలి. జిల్లాలో ఏ ఒక్క రైతు నుంచి కూడా ఎరువులు అందలేదని ఫిర్యాదులు రాకూడదు' అని స్పష్టం చేశారు. సమావేశంలో అధికారులు ఆర్.అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

వైసీపీ నేత హత్యకు కారణం కుటుంబ తగాదా పంచాయితీనే

- 8 మందిని అరెస్టు చేసిన పోలీసులు
- రాజకీయ కోణం లేదు: ఏఎస్పీ రమణ



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రమణ, పోలీసుల అదుపులో నిందితులు

శ్రీకాకుళం క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలానికి చెందిన వైసీపీ నేత సత్తారు గోపి హత్యకేసు మిస్టరీ వీడింది. ఈ నెల 11న కొయిరాల జంక్షన్ ఫరీదుపేట వద్ద జరిగిన ఈ హత్య కేసులో 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ రమణ వెల్లడించారు. ఇందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని, ఓ కుటుంబ తగాదా పంచాయితీ.. ఈ హత్యకు కారణమని స్పష్టం చేశారు. 'గోపి హత్య కేసు ఛేదించేందుకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలుగా దర్యాప్తు చేశాం. ఈ ఘటన వెనుక ఫరీదుపేటకు చెందిన కొత్తకోట సూర్యనారాయణ, పైడిపెద్ది సత్యనారాయణ, కొత్తకోట ఈశ్వరరావు, కొత్తకోట రంగనాథం, సీపాన శివకృష్ణ, సీపాన అనిల్‌కుమార్, పైడి రంగరామానుజులు, గురుగుబెల్లి భవానీ హస్తం ఉన్నట్టు గుర్తించాం. ఆ ఎనిమిది మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టాం. శనివారం ట్రిపుల్‌ఐటీ దగ్గర్లో ఎస్.ఎం.పురానికి చెందిన పొలాల మార్గంలో వారు ఉన్నట్టు సీఐ అవతారానికి సమాచారం వచ్చింది. ఈ మేరకు ఆ ఎనిమిది మందిని పట్టుకోగా, నేరం అంగీకరించారు. వారిని అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ నిమత్తం హాజరుపరిచామ'ని ఏఎస్పీ రమణ తెలిపారు.

ఉదంతం ఇదీ..

ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన గురుగుబెల్లి ఉమామహేశ్వరరావు, భవానీ దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కారణంతో తగాదాలు జరుగుతున్నాయి. ఉమామహేశ్వరరావు ఎచ్చెర్ల ఎంపీపీ, వైసీపీ నేత మొదలవలస చిరంజీవి వద్ద పని చేస్తున్నారు. ఎంపీపీ చిరంజీవి ఆ దంపతుల తగాదాను సెటిల్‌మెంట్ చేయాలని చూశారు. కాగా.. ఎంపీపీ ఇచ్చే సలహా భవానీకి నచ్చకపోవడంతో ఆమె ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి భర్త ఉమామహేశ్వరరావుపై ఫిర్యాదు (మిగతా 8వ పేజీలో..)

సమస్యలు పరిష్కరించాలి

- మునిసిపల్ పారిశుధ్య కార్మికుల డిమాండ్

ఎరువులు సక్రమంగా ఇవ్వడం లేదని రైతుల నిరసన

7 లో

కేజీబీవీ ప్రత్యేకాధికారిపై చర్యలు తీసుకోండి

- మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

కాశీబుగ్గలో చోరీ

8 లో



శ్రీకాకుళం జడ్పీ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

వర్షం వస్తే.. మురుగే!

అరసవల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం మధ్యాహ్నం గంటపాటు వర్షం కురిసింది. ప్రధాన కూడళ్లలో రోడ్లు జలమయమయ్యాయి. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణ నీరు నిలిచి చెరువును తలపించింది. కాలువల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నక్కవీధి నుంచి సంతోషిమాత ఆలయం వరకు వెళ్లే రోడ్డు మీదకు మురుగు నీరు చేరడంతో వీధి వ్యాపారులు, స్థానికులు అవస్థలు పడ్డారు. పారిశుధ్య సిబ్బంది ఇటీవల కాలువల్లోని చెత్తను తొలగించి అక్కడే వేయడంతో ఈ వర్షానికి దుర్గంధం వ్యాపించింది. అక్కడక్కడా మున్సిపల్ సిబ్బంది ఈ చెత్తను, బురదను తొలగించే పనిలో పడ్డారు.



నక్కవీధి - సంతోషిమాత ఆలయం రోడ్డులో ఇంటి ముందు నిలిచిన మురుగునీరు

రాష్ట్రంలో సుపరిపాలన

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యేలు, నేతలు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శనివారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంతోనే..

ఆమదాలవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని మోనింగివారివీధి, పాతినవారి వీధుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటిం టికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ శమ్మ మాధవి, మొదలవలస రమేష్, పీవీవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: శంకర్

శ్రీకాకుళం రూరల్,జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని, ఇందులో భాగంగానే సంక్షేమపథకాలు, అభి వృద్ధి కార్యక్రమాలు చేపడుతోం దని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం సానివాడ, వప్పంగి గ్రామాల్లో శనివారం సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వ హించారు. ప్రజలు, కార్యకర్తల కోసం నిర్విరామంగా పని చేస్తానన్నారు. కార్యక్ర మంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: ఒప్పంగిలో ఇస్త్రీ చేస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



ఆమదాలవలస: పట్టణంలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సంక్షేమ పథకాలతో ఆనందం

పాటపట్నం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సంక్షేమ పథ కాలు ప్రజలలో ఆనందోత్సాహాలు నింపుతున్నాయని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. కె.గోపాల పురంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు ఎంతో మేలు

కాశీబుగ్గ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ పరిధిలో గల 12వ వార్డు పల్లివీధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్య క్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటిఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వ పథకాలపె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో కొత్త అధ్యాయం

కొత్తూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ప్రజా పాలనలో కొత్త అధ్యాయంగా నిలుస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ప్రజలకు వివరించారు. శనివారం పొనటూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పొత్రకొండ మోహనరావు, కుద్దిగాం సర్పంచ్ నెల్లి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నా రాజకీయ జీవితం తెల్లకాగితం: అచ్చెన్న



డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి అచ్చెన్న

టెక్కలి, జూలై 19(ఆంధ్ర జ్యోతి): అచ్చెన్నాయుడు జీవితం తెల్ల కాగితమని, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా వ్యవ హరించానని, ఎక్కడైనా, ఎప్పుడైనా అవినీతికి పాల్ప డినట్లు రుజువు చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పు కుంటానని మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు వైసీపీ నాయకులకు సవాల్ విసి రారు. శ్రీనివాస్ నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా శనివారం బహిరంగ సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులకు సిగ్గు, లజ్జా ఉందా అని ప్రశ్నించారు. అచ్చెన్నాయుడు గ్రావెల్ కొండలు దోచుకు తింటున్నాడని, మూలపేట పోర్టులో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడని విమర్శలు చేస్తున్నారని, పోర్టు నిర్మాణం చేస్తున్నది ప్రభుత్వమని గుర్తెరగాలన్నారు. పోర్టు నాదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఒక మంత్రి, స్పీకర్ కూడా ఉండి చేసిన అభివృద్ధి శూన్యమని, వారు చేసిన అభివృద్ధి ఏమి టో చర్చకు రావాలని మంత్రి సవాల్ విసిరారు. పలు సీసీ రోడ్ల పనులకు, డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమం లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, నేతలు ఎల్ఎల్ నాయుడు, పినకాన అజయ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, కామేసు, రాము, సుందరమ్మ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: కె.గోపాలపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

న్యూస్ బాక్స్

ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలి

ఆమదాలవలస, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ముస్లిం కాలనీలో ఉర్దూ మాధ్యమం పాఠశాలను ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ విభా గం కార్యదర్శి షేక్ మాలిక్ కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కూన రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందిం చారు. ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉర్దూ పాఠశాల అత్యవసరమని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనం తరం సుమారు 20 ముస్లిం కుటుం బాల వారు ఎమ్మెల్యేని సత్కరించారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, షేక్ కలేశా, షేక్ అప్సర్, షేక్ బషీరుద్దీన్ తదిత రులు పాల్గొన్నారు.

మంత్రి 'కొల్లు'కు ఘన స్వాగతం

రణస్థలం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్రకు శనివారం ఎమ్మెల్యే నడు కుదిటి ఈశ్వరరావు స్వాగతం పలికారు. మంత్రి రవీంద్ర ఎన్ఈఆర్ ఇంటికి రాగ నాయకులు, కార్యకర్తలను ఆయనకు ఎన్ఈఆర్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, కొమరాపు రవి, పిసిని జగ న్నాథం నాయుడు, రౌతు శ్రీనివాసరావు, లుకలాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నమ్మ తల్లిని దర్శించుకున్నమంత్రి

అరసవల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కలగ జగదీష్, రాష్ట్ర జంగమ సాధి కారిక డైరెక్టర్ విభూది సూరి బాబుతో కలిసి పెద్దపాడులోని అప్ప న్నమ్మ అమ్మవారిని శనివారం దర్శించు కున్నారు. నగరంలోని 31వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సూరి బాబును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శంక రరావు, సుభాష్, రమేష్, శివ చరణ్, విజయ్, కృష్ణ, గడ్డెన్న పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎంపీ

రణస్థలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శని వారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయనగరంలోని ఆయన స్వగృ హంలో కలిసి మొక్కను అందించి, శాలువా కప్పి అభినందించారు.

ఆ బియ్యం.. హాంఫట్!

(ఐదో పేజీ తరువాయి)

డిపోల్లో డీలర్ల ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. అయినప్పటికీ కొంతమంది అధికారుల తీరు మారడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలు లేకనే..

కూటమి అధికారంలోకి వచ్చిన కొత్త పౌర సరఫరాల గోదాములును విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కాటాలు, స్టాక్‌ను పరిశీ లించారు. గత ఆరు నెలల నుంచి పెద్దగా తనిఖీలు లేకపో వడంతో మళ్లీ గోదాముల్లో అవినీతి జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. సీఎస్ డీటీలు, ఆర్ఐ స్థాయి అధికారులు ఇన్‌చార్జిలుగా గోదాములను సక్రమంగా పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది కళాసీలకు ఆ బాధ్యత అప్పగించడంతో అక్కడ ఏమి జరుగు తుందో తెలియని పరిస్థితి నెలకొంది. తరుగు వస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు మిల్లుల్లో నిల్వ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొత్తూరు మండలం కడుమ రైస్ మిల్లు నుంచి 700 బస్తాల బియ్యం ఒడిశా తరలి స్తుండగా పార్వతీపురం మన్యం జిల్లాలో విజి లెన్స్ అధికా రులకు పట్టుబడడం చర్చ నీయాంశంగా మారింది.

చర్యలు తీసుకుంటాం

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసి వచ్చే నెల నుంచి జాగ్రత్తలు తీసుకుంటాం. డిపోల డీలర్లు దగ్గర ఉండి బియ్యం తూకం వేయించి తీసుకోవాలి. తూకం లేకుండా బియ్యం ఇస్తే గోదాం ఇన్‌చార్జిపై చర్యలు తీసుకుంటాం.

- బి.పాపారావు, తహసీల్దార్, మెళియాపుట్టి

'ఉపాధి' పనులు పారదర్శకంగా చేపట్టాలి

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- రూ.25 లక్షల మేర అక్రమాల గుర్తింపు
- బాధ్యులపై చర్యలు
- డ్వామా పీడీ సుధాకరరావు

లావేరు, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవర ణలో 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉపాధి పనులను ప్రజలకు చేరువ చేయాలన్నారు. డ్వామా పీడీ బి.సుధాకరరావు మాట్లాడుతూ.. ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్య లు తప్పవని హెచ్చరించారు. 2024-25లో లావేరు మండలంలో సుమారు రూ.30 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. వీటిలో లావేరులో ఆశ వర్కర్లు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మి కులు, శాశ్వత దివ్యాంగుల పేరున మస్టర్లు వేసి సుమారు రూ.25 లక్షలు అక్ర మాలకు పాల్పడి నట్లు తనిఖీల్లో వెల్లడైనట్లు తనిఖీ అధికారులు ప్రకటించారు. పైడాయవలస పంచాయతీ లో మృతిచెందిన 8 మంది పేర్లపై రూ.80,160 వర కు బినామీ మస్టర్లు వేసినట్లు తనిఖీల్లో బయ టపడింది. అలాగే మిగిలిన పంచాయ తీల్లోనూ అక్రమాలు జరిగి నట్లు గుర్తించారు. మండలం లోని 33 పంచాయతీల్లో కూడా పనులు కొలతల్లో వ్యత్యాసం వచ్చి సుమారు రూ.కోటి పనుల్లో తక్కువ పరి మాణంలో పనులు చేసి వేతనాలు ఇచ్చినట్లు తనిఖీల్లో గుర్తించారు. రాత్రి 11 గంటల వరకు సామాజిక తనిఖీ వేదికను నిర్వహించారు. కార్యక్రమంలో డీవీవో లవరాజు, ఏపీడీలు పంచాది రాధ, ఎస్. లోకేష్, ఎంపీడీవో పి.వెంకటరాజు, ఎస్ఆర్పీ సూర్య నారాయణ, మండల ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ, కూటమి నాయకుడు ముప్పి డి సురేష్, ఏపీవో ఆర్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ శనివారం అందించారు. కంచిలి మండ లానికి చెందిన బెందాళం మనోహర్‌కి రూ.1.16 లక్షలు, బాలక కల్పనకు రూ.86 వేలు, ధనుంజయ కు రూ.1.60 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బదిలీ

శ్రీకాకుళం క్రైం, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకా కుళం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పని చేస్తు న్న బండారు రాజశేఖర్‌ను విజయవాడ సైబర్ క్రైం ఏసీపీగా బదిలీచేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశా రు. ఆయన గత ఏడాది సెప్టెంబరులో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. గడ చిన ఏడు నెలలుగా ఈయన సెలవులోనే కొన సాగుతున్నారు. ఎట్టకేలకు ఆయనకు ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

25న కాకినాడలో కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతిభ కలిగిన యువ కబడ్డీ క్రీడాకా రులు టాలెంట్ సెర్చ్ ఎంపికలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలి నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 25న కాకినాడ, పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం ఏడు గంట లకు లీగ్‌కు సంబంధించిన ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఆంధ్రా కబడ్డీ అసో సియేషన్ (ఏకేఏ) ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి 25వ తేదీ వరకు జరగనున్న మొదటి యువ ఆంధ్రా కబడ్డీ చాంపియన్‌సిప్ (తెలుగు కబడ్డీ లీగ్) పోటీల్లో ఎనిమిది జట్లుగా విడదీసి పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ జట్టులో 23, 25 సంవ త్సరాల లోపు వారికి విడివిడిగా ఎంపిక చేయడం జరుగుతుందని, 85 కేజీలలోపు క్రీడా కారులై ఉండాలన్నారు. ఆసక్తి గల యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీడ్ డ్రిల్ యంత్రంతో సాగు లాభదాయకం

- కేవీకే కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి

సరుబుజ్జిలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి నాట్లు ఆలస్య మవుతున్నందున సీడ్ డ్రిల్ యంత్రాన్ని వినియోగించడం ద్వారా సాగు లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గ్రామంలో సీడ్ డ్రిల్ యంత్రంతో సాగు చేసిన వరిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ యంత్రంతో మొక్కజొన్నతో పాటు 9 మందికి పైగా పంటల విత్తనాలు వేసే వీలుంటుందన్నారు. భూమిని దమ్ము చేసి నాట్లు వేయాల్సిన అవసరం లేకపో వడం వల్ల రైతుల కు సుమారు రూ.6 వేలు వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. కార్యక్ర మంలో రాయ్, హరి కుమార్, రెడ్డీస్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్లు అత్తు లూరి లావణ్య, పాతిని శ్రీనివాసరావు, శివ్వాల కుమారి తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

హమ్మయ్య.. ఉపాధి పనులు ముగిశాయి

- పనిముట్లకు పూజలు చేసిన వేతనదారులు



గార జూలై 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత దయ వల్ల ఈ ఏడా ది ఉపాధి పథకం పనులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యాయని వేతనదారులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ మేరకు శనివారం బూరవెల్లిలో ఉపాధి పనులు చేపట్టిన పనిముట్లకు పూజలు చేశారు. గునపం, పార, తట్టలు, కొడవళ్లు తదితర పరికరాలను కడిగి పసుపు రాసి, బొట్లు పెట్టి ఒక చోట ఉంచి పూజలు చేసి పాయసం నివేదన చేశారు.

పర్యావరణ పరిరక్షణపై శ్రద్ధ వహించాలి



రణస్థలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగం డైరెక్టర్ డి.చంద్ర శేఖర్‌వర్మ అన్నారు. అపిటోరియా ఫార్మాలో శని వారం 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' చేపట్టారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఫ్యాక్టరీలో విరి విగా మొక్కలు పెంచాలన్నారు. సిబ్బందికి పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమం లో ఫ్యాక్టరీస్ జేడీ జె.శివశంకర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్.మదన్‌కుమార్, ఈహెచ్‌సీ హెడ్ ఇ.సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్ఛాపురం/ఆమదాల వలస, జూలై 19(ఆంధ్ర జ్యోతి): మునిసిపల్ పారి శుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు రమేష్ పట్నాయక్, తాడి సంతోష్ అన్నారు. శనివారం ఇచ్ఛాపురం, ఆమ దాలవలస మస్టర్ కార్యాయాల వద్ద రోడ్డుపై బైఠాయించి, అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాం డ్ చేశారు. కార్య కమంలో ఫెడరేష్ శాఖ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, నాయకులు శ్రీనివాసరావు, తార కేశ్వరరావు, ధనలక్ష్మి, రమ, ఈశ్వరరావు, నీలమ్మ, శ్రీనివాస్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కంచిలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): జాడుపూడికి చెందిన కొయ్యి మన్మథ రావు(54) గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళీ దుర్గా మాత సేవా సంఘం సభ్యులు స్పందించి ఆయన కుటుంబానికి రూ.54 వేలు సాయాన్ని శనివారం అందించారు.

ఎరువులు సక్రమంగా ఇవ్వడం లేదని రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

పొందూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎరువులను సక్రమంగా పంపిణీ చేయడం లేదని, దీంతో ఇబ్బందులు పడు తున్నామని దళ్లిపేటలో శని వారం రైతులు నిరసన తెలి పారు. యూరియాను సచివాల యంలో కాకుండా అధికార పార్టీ నేతల గోడౌన్‌లో నిల్వ చేస్తున్నారని ఆరోపించారు. శనివారం వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేసి రైతుల ఆరోపణలపై స్పందిం చారు. సచివాలయంలో నిలువ చేసేందుకు స్థలం లేక శుక్రవారం సాయంత్రం వచ్చిన యూరియాను వేరేచోట భద్రపరి చామని, రైతుల 1బి ఆధారంగా యూరియా పంపిణీ చేపడుతున్నట్లు ఏవో శ్రీనివాసరావు తెలిపారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆమదాలవలస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మునిసి పాలిటీని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నా రు. శనివారం ఐజేనాయుడు కాలనీ నుంచి లక్ష్ముడుపేట వరకు, మోనింగివారివీధి నుంచి పూజారిపేట వరకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముని సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, పీఏసీ ఎస్ అధ్యక్షుడు శిమ్మ మాధవి, నాయకులు మొదల వలస రమేష్, బోర గోవిందరావు, మూల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్వగ్రామానికి రాజు మృతదేహం

గార రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వమరవల్లి పంచాయతీ గొర్లెవానిపేటకు చెందిన నీలాపు రాజు(50) 5 రోజుల క్రితం అబుదాబిలో మృతి చెందిన విషయం విదితమే. మృతదేహం శనివారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఎనిమిది నెలల క్రితం గ్రామానికి వచ్చి..తిరిగి వెళ్లాడని... ఇలా విగతజీవిగా చూస్తామని అనుకోలేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పేకాటరాయుళ్లకు నెల రోజుల జైలు

శ్రీకాకుళం క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతూ శుక్రవారం పట్టుబడిన ఐదుగురు వ్యక్తులకు శనివారం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ 30 రోజులు జైలు శిక్ష విధించినట్టు ఒకటో పట్టణ ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు. బోను గోవింద అలియాస్ గోల్డ్ గోపీపై గతంలో పేకాట ఆడి పట్టుబడినట్టు నాలుగు కేసులు, బలగ ప్రసాద్‌పై ఐదు, మచ్చ మోహన్‌కృష్ణపై రెండు కేసులు ఉన్నట్టు తెలిపారు. వీరి నుంచి రూ.46, 970 నగదు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోటబొమ్మాళి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి చిన్నబమ్మిడి జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం సత్తర్వుపాడు గ్రామానికి చెందిన సింగుపురం వెంకటరమణ గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం వెంకటరమణ తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనం పై తిలారు బయలుదేరాడు. చిన్నబమ్మిడి జంక్షన్ వద్దకు వచ్చే సరికి ద్విచక్రవాహనం పాడైపోవడంతో నడిపించుకుంటూ రోడ్డు దాటుతుండగా టెక్కలి వైపు నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాధంలో వెంకటరమణకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని..బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్.ఐ. సత్యనారాయణ తెలిపారు.

పిడుగు పడి గేదె మృతి

జలుమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): టెక్కలిపాడులో శనివారం మధ్యాహ్నం పిడుగుపడి గేదె మృతి చెందింది. నరసన్నపేట మండలం దశమంతపురం గ్రామానికి చెందిన జుత్తు వెంకటరమణకు చెందిన గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మేతకు టెక్కలిపాడు వైపు తరలించగా పిడుగు పడడంతో గేదె మృతి చెందినట్లు వారు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

నందిగాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): దిమ్మిడిజోల గ్రామానికి చెందిన సలాన ఢిల్లీశ్వరరావు(76) అనే వృద్ధుడు అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ కె.జిన్నారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఢిల్లీశ్వరరావు ఈనెల 12నటెక్కలి ఆస్పత్రికి వెళ్లి... అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ఓ కళాశాలలో చదువుతున్న మనవడిని కలిసేందుకు వెళ్లాడు. అటు నుంచి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆచూకీ కోసం వెదికినా లభించలేదు. కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ తెలిపారు.

కాశీబుగ్గలో చోరీ


బీరువా పగులగొట్టిన దృశ్యం

పలాస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న కొండాల వనజాక్షి అనే మహిళ ఇంటిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రూ.1.25 లక్షల విలువైన 14 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు దొంగలు తస్కరించినట్లు బాధితురాలు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనజాక్షి కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇంటికి తాళాలు వేసి శుక్రవారం రాత్రి విధులకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు విరగొట్టినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు. ఈ మేరకు సిఐ పి.సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పశుమాంసం తరలిస్తున్న వాహనం స్వాధీనం

హరిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బిన్నల గ్రామం జాతీయ రహదారి వద్ద పశుమాంసం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. కటక్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న పార్శిల్ వాహనం నుంచి నీరు వస్తుండటంతో ఎస్‌ఐ కృష్ణప్రసాద్ డ్రైవర్‌ను వివరాలడిగారు. సరైన సమాధానం చెప్పకపోవడం.. లోడుకు తగిన పత్రాలు లేకపోవటంతో అనుమానంతో తనిఖీ చేసి... సుమారు ఐదు టన్నుల మాంసాన్ని గుర్తించారు. స్థానిక పశువైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ పరీక్షించి పశుమాంసంగా నిర్ధారించారు. రాజమండ్రికి చెందిన డ్రైవర్ వెంకన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి వైరు చోరీ

హరిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొత్తకమలాపురం, బాలిగాం గ్రామాల సమీపంలోని జాతీయ రహదారి పక్కనే పొలాలకు విద్యుత్తు సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి వైరు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ కృష్ణప్రసాద్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 11కేవీ విద్యుత్తును ట్రాన్స్‌ఫార్మర్‌లకు రాకుండా కట్‌చేసి రాగివైరుతో పాటు విలువైన సామగ్రిని దొంగిలించుకుపోయారు. రైతులు ఉదయం పొలాలకు వెళ్లే సరికి చోరీ విషయాన్ని గమనించి విద్యుత్తు శాఖ ఏఈ యోగి, సిబ్బందికి సమాచారం అందించారు. వారు రైతులు బొంగి వెంకయ్య, సీతారాం, బావన సాంబమూర్తి, సీపాన నారాయణ, నారాయణస్వామిలతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నేత హత్యకు కారణం కుటుంబ తగాదా పంచాయితీనే

(ఐదో పేజీ తరువాయి)

చేసింది. దీంతో 498(ఎ), 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఉమామహేశ్వరరావుకు ఎస్‌ఐ సందీప్ నోటీసులు అందించారు. అయితే భవానీ.. సత్తారు గోపి హత్య జరిగిన రోజు.. గ్రామంలో తెలిసిన ఏడుగురితో తన భర్తయిన ఉమామహేశ్వరరావు కొయిరాల జంక్షన్ వద్ద ఉన్న ఇంటికి వెళ్లింది. ఇంట్లో సామాన్లు తీసుకుపోవాలని ప్రయత్నించింది. ఆ సమయంలో సత్తారు గోపి, ఆయన స్నేహితుడు కోటేశ్వరరావు.. ఇంటి సామాన్లు ఎలా తీసుకుపోతారని నిలదీసేందుకు వచ్చారు. అయితే అప్పటికే భవానీతో వచ్చిన వ్యక్తులు మద్యం మత్తులో గోపీని హైవేపై నిలువరించేందుకు దాడి చేశారు. గోపి కింద పడిపోవడంతో, ఆయన స్నేహితుడు కోటేశ్వరరావు పారిపోయాడు. గోపిని పక్కనే ఉన్న సందులోకి వారంతా తీసుకెళ్లి కర్రలు, ఇటుకలతో దాడిచేయగా మృతి చెందాడు. దీంతో వారంతా పరారయ్యారని ఎఎస్పీ తెలిపారు. అయితే నిందితులుగా పేర్కొన్న కొంతమందిని గోపి కొద్దిరోజులుగా వేధిస్తూ దాడులు చేయడం కూడా హత్యకు ఒక కారణమని వివరించారు. అలాగే ఫరీదుపేటకు చెందిన టీడీపీ నేత కొత్తకోట అప్పినాయుడును కూడా భవానీ ఈ కుటుంబ తగాదాలో ఆశ్రయించిందని తెలిసిందన్నారు. ఈ మేరకు అప్పినాయుడు, మరికొందరిని పూర్తిస్థాయిలో విచారించి వివరాలు వెల్లడించాల్సి ఉందని ఎఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, ఎస్‌ఐలు సందీప్‌కుమార్, బాలరాజు, లక్ష్మణరావు, చిరంజీవి, పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో అందరం భాగస్వాములం కావాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. దీనిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

-ఆంధ్రజ్యోతి బృందం


టెక్కలి: పారిశుధ్య కార్మికులను సత్కరించిన మంత్రి అచ్చెన్న


లావేరు: ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


అరసవల్లి: పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్‌లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎమ్మెల్యే శంకర్



జలుమూరు: ర్యాలీలో పాల్గొన్న జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్


గార: మండల పరిషత్ పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

మందస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో పని చేస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస రాజా శ్రీనివాస మెమోరియల్ (ఎస్ఆర్ఎస్ఎం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 150 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాల ఎంతోమందిని ప్రయోజకులుగా చేసిన ఘనత వహించిందన్నారు. మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ ఈ పాఠశాలను రాష్ట్రంలోనే గుర్తింపు పొందేలా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పాఠశాలకు అవసరమైన కంప్యూటర్లు ఎంపీ నిధుల నుంచి మంజూరుకు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మందస రాజవంశీయులు లిఖిల్ కుమార్ సింగ్ దేవ్, డీఈవో తిరుమల చైతన్య, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

కాశీబుగ్గ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం కాశీబుగ్గ 12వ వార్డులో గల ధోబీఘాట్ వద్ద ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస కాశీబుగ్గలో పక్కా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, కమిషనర్ రామారావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీల నూతన కార్యవర్గం

టెక్కలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఏపీఎస్‌జీటీయూ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సత్తారు పోలినాయుడు, అధ్యక్షులుగా ఎన్.సురేష్‌కుమార్, సహాధ్యక్షులుగా యోగి జనార్దనరావు, ఉపాధ్యక్షులుగా కె.వేణుగోపాలరావు, కె.శంకరరావు, ఎన్.భారతి, ప్రధాన కార్యదర్శిగా మూల రమణా రావులను ఎన్నుకున్నారు అదనపు ప్రధాన కార్యదర్శిగా బి.అనూరాధ, కార్యదర్శులుగా వసంతరావు, సరోజిని, తవిటినాయుడులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలు ఎందుకు పంపిణీ చేయడం లేదు?: జేసీ


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న జేసీ

జలుమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'చిన్నారులకు పాలు ఎందుకు అందజేయడం లేదని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఐసీడీఎస్ పీవోను ప్రశ్నించారు. కరవంజలో గల అంగన్‌వాడీ, రేషన్ డిపోలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు పంపిణీ జరగకపోవడంపై సంబంధిత పీవోను వివరణ అడిగారు. పీవో అనూరాధ మాట్లాడుతూ పాల ప్యాకెట్లను ప్రస్తుతం సారవకోట మండలంలో పంపిణీ చేస్తున్నామని, జలుమూరులో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తామని జేసీకి తెలిపారు. ఆదర్శ పాఠశాలలో భోజన పథకం వంటలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. చల్లవానిపేట కూడలిలో గల శ్రీలక్ష్మీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయించినట్లు రుజువైతే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఒక ఎకరాకు యూరియా ఏ మేరకు వేయాలని సంబంధిత వ్యవసాయ సహాయకులను అడిగారు. సరైన సమాధానం రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసారు. గుంజుమెట్టవద్ద రోడ్డుకు ఇరువైపుల చెత్త ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేసారు. చెత్తను తక్షణమే తొలగించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జె.రామారావు, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఆర్.ఐ కిరణ్, ఎంఈవో బి.మాధవరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల ఏర్పాటుతో అభివృద్ధి


చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్

హిరమండలం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లయితే సమీప గ్రామాల్లోని కుటుంబాలకు ఆదాయం పెరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం పూలకొండ, గొడియాపాడు గ్రామాలను సందర్శించారు. వంశధార రిజర్వాయర్, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. శ్రీముఖలింగం, శ్రీకూర్మం, వంశధార రిజర్వాయర్ వంటి పర్యాటక ప్రాంతాలను మరింత అభివద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో యువతకు పర్యాటక రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుందన్నారు. గొడియాపడు పాఠశాలను తనిఖీ చేసి ప్రభుత్వం అందజేసిన కిట్లను పరిశీలించారు. గ్రామంలోని గిరిజనులు మాట్లాడుతూ ఇప్పటి వరకు దోమతెరలు అందలేదని చెప్పారు. కొంతమంది రైతులు పోడు పట్టాలు అందలేదని తెలిపారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. వీటిని వెంటనే పరిష్కరించాలని మండల అధికారులకు ఆయన ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీఓ కాశీప్రసాదరావు తదితరులు ఉన్నారు.

చిన్నారితో ముచ్చట్లు

కలెక్టర్ స్వప్నిల్ దినక్ గొడియాపడు పర్యటనలో రెండో తరగతి చదువుతున్న బిడ్డిక శామ్యూల్ అనే చిన్నారిని చూసి ఆగారు. కొంతసేపు ఆ విద్యార్థితో ముచ్చటించారు. ఎలా చదువుతున్నావు? భవిష్యత్‌లో ఏమవ్వాలనుకుంటున్నావని ప్రశ్నించారు. ఆ చిన్నారి అమాయక సమాధానాలు విని కలెక్టర్ ముచ్చట పడ్డారు. స్టూడెంట్ కిట్ ధరించి ఉన్న శామ్యూల్ తన తల్లిదండ్రుల గురించి చెప్పిన విధానం కలెక్టర్‌ను ఆకట్టుకుంది. రెండో తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగితే విద్యార్థి ధైర్యంగా సమాధానం చెప్పడంపై కలెక్టర్ చిరునవ్వులు చిందించారు.

బంగారు కుటుంబాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఈవో

మెళియాపుట్టి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా తెలిపారు. శనివారం బాణాపురం పంచాయతీలో బంగారు కుటుంబాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు లేని కుటుంబాలను చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా మార్గదర్శులు పేదలను ఆదుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సైతం కుటుంబాలను దత్తత తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, కార్యదర్శి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి, జూలై 19 (ఆంధ్రజ్యోతి):స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా వినియోగించాలని... తప్పనిసరిగా యూనిట్లు స్థాపించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి నందిగాం, సారవకోట మండలాల బ్యాంకు మేనేజర్లు, ఏపీఎంలు, సీసీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు పారిశ్రామికవేత్త కావాలని , దీనికి అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వంతో పాటు బ్యాంకులు అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం పి. శ్రీనివాసరావు, బ్యాంకు లింకేజి డీపీఎం నాగలక్ష్మి, శ్రీ నిధి ఏజీఎం సత్యనారాయణ, ఐటీడీఏ ఏపీడీ సన్యాసిరావు, ఏపీఎంలు సూర్యనారాయణ, మనోరత్నం, శ్రీనివాసరావు, ఉమారాణి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సుశీల, సీసీలు పాల్గొన్నారు.

చతుర్విధ ప్రక్రియలపై సాధన చేయించాలి

నరసన్నపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఐదో తరగతి లోపు విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలను నేర్పించాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు సూచించారు. శనివారం బాడాం, ఉర్లాం, బోర్డు ఉన్నత పాఠశాల, సత్యవరం, బొరిగివలస, మడపాం పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారిపై చర్యలు తీసుకోండి


సభ్యులకు సమాధానమిస్తున్న ఎంఈవో

కొత్తూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వసప కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పల్లా రాధిక అక్రమాలకు పాల్పడుతున్నారని.. విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గోవిందరావును కోరారు. శనివారం మండల మండల పరిషత్ అధ్యక్షురాలు సవర సావిత్రి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఎంఈవోపై ప్రశ్నల వర్షం కురిపించారు. కేజీబీవీ సిబ్బందిపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని చెప్పారు. దీంతో పాఠశాలను సందర్శించి నివేదికను ఉన్నత అధికారులకు పంపాలని మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎల్.తులసీ వరప్రసాదరావు ఆదేశించారు. వెలుగు ఏపీఎం పనితీరుపై తీవ్రస్థాయిలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 నవంబరులో విధుల్లో చేరి నేటికి చార్జీ తీసుకోకపోవడంపై మండిపడ్డారు. మండల సమావేశంకు ఐసీడీఎస్ పీవో హాజరు కాకపోవటంతో సూపర్‌వైజర్లను మాట్లాడేందుకు అనుమతి ఇవ్వలేదు. వివిధ సమస్యలపై చర్చించారు. సమావేశంలో మెట్టూరు బిట్-3 సర్పంచ్ వి.శ్రీనివాసరావు, తహసీల్దారు కె.బాలకృష్ణ ఎంపీడీవో వి. నీరజ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రవీంద్రకు ఘన స్వాగతం

కోటబొమ్మాళి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శనివారం సోంపేట పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి కొత్తపేట జంక్షన్ వద్ద టీడీపీ నేతలు ఆయనకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పూలమాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కళింగ కోమటి సంఘ అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవింద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మక్క లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నేడు ఉపకరణాలు పంపిణీ

టెక్కలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఉపకరణాలను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఆదివారం సాయంత్రం అందజేయనున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. అంజనాపురం లేఅవుట్‌ను మంత్రి పరిశీలించనున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే


సీఐ సూర్యనారాయణ

పలాస, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధన లు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారీ వాహనాలు ఉదయం 7.30 నుంచి రాత్రి పది గంటల వరకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోకి రాకూడదన్నారు. ఆ సమయంలో సాధారణ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొన్ని వాహనాలకు మినహాయింపు ఇచ్చామన్నారు. అత్యవసర వాహనాలు, కూరగాయలు, పాలు, గ్యాస్ బండలు తీసుకువచ్చే వాహనాలు ఆ సమయంలో రావచ్చని తెలిపారు. లక్ష్మీపురం టోల్‌గేటును తప్పించుకోవడానికి ఎక్కువగా లారీలు, ఇతర గూడ్స్ వాహనాలు పట్టణంలోకి వస్తున్నాయని, ఇక నుంచి అటువంటి వాహనాలు వస్తే భారీ జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

కాశీబుగ్గ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జోక్యం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె ఆగదని మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాశీబుగ్గ సంత మైదానంలో మోకాళ్లపై నిలుచొని నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, యూనియన్ నాయకులు మురుగన్, వెంకట్, రవి, శంకర్‌లు మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, బాలకృష్ణ, శంకుతల పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌పై అప్రమత్తం

టెక్కలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఈవ్‌టీజింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం, బీసీ బాలుర కళాశాల వసతిగృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.

న్యూస్ బాక్స్

అంతా ఒకటిగా వినాయక పూజ చేద్దాం

వజ్రపుకొత్తూరు, జూలె 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 27న వీధికో మండపం కాకుండా అంతా ఐక్యమత్యంగా ఉండి గ్రామంలోని రామాలయం వద్ద వినాయక పూజను చేసుకుందామని బాతుపురం యువత తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం బాతుపురం రామాలయం వద్ద యువకులు సమావేశం నిర్వహించి పూజలపై చర్చించారు.

ఎంఈఓ-2గా దాలయ్య

హిరమండలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మండల విద్యాశాఖ అధికారి-2గా ఎస్.దాలయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన గులుమూరు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

డీఎంహెచ్‌వో తనిఖీ

హిరమండలం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి అనిత శనివారం తనఖీ చేశారు. ఓపీ రిజిస్టర్లు, ఉద్యోగుల హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రసవాల సంఖ్య, జ్వర సర్వే నివేదిక, గ్రామాల్లో జ్వరాల కేసుల వివరాలను వైద్యాధికారులు ఫరూక్ హుస్సేన్, సాయికుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆమె సూచించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

నందిగాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావులు సూచిం చారు. శనివారం మండలంలోని నందిగాం, నర్సిపురం, నౌగాం, తురకలకోట, హరిదాసుపురం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడమే కాకుండా సామర్థ్యాలను అందించి... వారిలో చైతన్యం నింపాలన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.